క్లుప్తంగా

ప్రమాదకరంగా వంతెన

కరకగూడెం: మండల పరిధిలోని సారపాక ప్రధాన రహదారి వద్ద ఉన్న బూడిద వాగు వంతెన గతేడాది కురిసిన భారీ వర్షాలతో పాటు తాజాగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిని కొంత ప్రమాదకరంగా మారింది. ఈ క్రమంలో మంగళవారం విషయం తెలుసుకున్న మండల స్పెషల్ ఆఫీసర్, ఏడీ మైన్స్ దినేష్ కుమార్, కరకగూడెం ఎస్సై రాజేందర్ సదరు ప్రాంతాన్ని సందర్శించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మణుగూరు, పినపాక మండలాల నుంచి అధిక లోడుతో వస్తున్న ఇసుక లారీలను అడ్డుకొని పరిస్థితిని డ్రైవర్లకు వివరించి వెనక్కి మళ్లించారు. వర్షాలు తగ్గిన తరువాత బ్రిడ్జికి శాశ్వతంగా మరమ్మతులు చేపడుతామని స్థానికులకు హామీ ఇచ్చారు.

శక్తిమేరకు పని చేశా..

ములకలపల్లి: ఐదేళ్ల పదవీ కాలంలో ములకలపల్లి మండల అభివృద్ధికి శక్తిమేరకు కృషి చేశానని జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి అన్నారు. మంగళవారంతో పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో మాధారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలపై జెడ్పీ సమావేశంలో పలుమార్లు గళమెత్తినట్లు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

అశ్వాపురం: మండల పరిషత్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగింపు సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతువేదికలో ఎంపీడీఓ వరప్రసాద్, మండల పరిషత్ కార్యాలయం అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు బహూకరించారు.

ఇష్టారీతిగా లారీలు నిలిపితే చర్యలు

మణుగూరురూరల్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ప్రధాన రహదారి వెంబడి లారీలను నిలిపితే చర్యలు తీసుకుంటామని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన బీటీపీఎస్, సింగరేణి, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇష్టం వచ్చినట్లు రోడ్డుపై లారీలను నిలపడం వల్ల చిన్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, 15వ తేదీలోగా లారీల పార్కింగ్ సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. బీటీపీఎస్ సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

చర్ల: చింతగుప్ప చెక్‌డ్యాం మరమ్మతులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం చింతగుప్ప సమీపంలో వరదలకు కొట్టుకు పోయిన చెక్‌డ్యాం ప్రాంతాన్ని ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. నాయకులు తాటి నాగమణి, శ్యామల వెంకట్, రైతులు కాకా వెంకటేశ్వర్లు, రాజారావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గుండాల: ఆళ్లపల్లి ప్రెస్‌క్లబ్, చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 27 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం ఇచ్చారని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బిక్షం, శేఖర్‌లు తెలిపారు. అతిథిగా ఎస్సై రతీష్ పాల్గొని మాట్లాడారు. వైద్యాధికారి రేవంత్, ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎం శాంతయ్య, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాపారావు, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ 30 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పాఠశాల ఆవరణను పరిశీలించారు. హెచ్‌వీ దుర్గమ్మ, సిబ్బంది ప్రసాద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలుకు వినతి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరచిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని మండల బీజేపీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోలికపోగు మునలయ్య, మడివి రవి, గొట్టిపుళ్ల శ్రీను, దారా నాగేశ్వరరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

రూ.2 లక్షలు విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్ర స్వామి ఆలయం నిర్మాణంలో ఇతర నిర్మాణాలకు గ్రామానికి చెందిన కొల్లు లింగారెడ్డి కుమారుడు కొల్లు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రూ.2,01,116 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సీలింగ్ ఫ్యాన్ వితరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ గల సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. సంస్థ అధ్యక్షుడు దార బాలాజీ రావు, పోగ్రాం చైర్మన్ వరలక్ష్మి, క్లబ్ సెక్రటరీ విద్యాసాగర్, కోశాధికారి శ్రీనివాస్, ఇమ్మిడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ పి.శ్రీమహాలక్ష్మి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ రవికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్స్ రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పొంగిన వాగులు

- పలుచోట్ల దంచికొట్టిన వాన
- వాగులు, వంకల ఉధృతితో రాకపోకలకు అంతరాయం
- కూలిన ఇళ్లు, నేలకొరిగిన వృక్షాలు



చర్ల: ఉధృతంగా ప్రవహిస్తున్న ఈతవాగు..



ములకలపల్లి: పాలవాగు డైవర్షన్ రోడ్డుపై ప్రవాహ ఉధృతి..



చర్ల: విద్యుత్ లైన్‌పై విరిగిపడిన వృక్షాలు

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో సోమవారం తెల్లవారు జామునుంచి భారీ వర్షం కురుస్తుండడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గిరిజనులు వాగులు దాటరాదని, అత్యవసరమైతే అధికారులకు సమాచారం అందించాలని ఎస్సై రాజమౌళి అన్నారు.

బూర్గంపాడు: మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఇరవెండి గ్రామానికి చెందిన కణితి బాబురావు రేకుల ఇల్లు నేలకూలింది. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది. బురావును స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ప్రభుత్వపరంగా సాయమందిస్తామని హామీ ఇచ్చారు.

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి వృక్షాలు విరిగి సమీపంలో ఉన్న విద్యుత్‌లైన్‌పై పడ్డాయి. దీంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వాటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ములకలపల్లి: మండల పరిధిలోని ముత్యాలంపాడు శివారులోని పాలవాగు ప్రవాహం పరవళ్లు తొక్కింది. మంగళవారం కురిసిన భారీవర్షానికి డైవర్షన్ రోడ్డుపై వరద ఉధృతి ప్రవహించింది. దీంతో ముత్యాలంపాడు, సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాత్రి వేళకు వరద తగ్గడంతో మరలా రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.



బూర్గంపాడు: నేలకూలిన ఇంటి వద్ద బాధితుడు

మండలంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి కురుస్తున్న భారీ వర్షానికి లింగాపురం పాడు సమీపంలో ఉన్న ఈత వాగుకు వరద నీరు పోటెత్తింది. దీంతో ఈతవాగు లోలెవెల్ చప్టా నీట మునగగా లింగాపురం, గొంపల్లి, కొత్తపల్లి మొగళ్ళపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

సమస్యలు పరిష్కరించండి సారూ..

భద్రాచలం: అష్టకష్టాలు పడుతున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించండి ఎమ్మెల్యే సారూ.. అంటూ నర్సింగ్ శిక్షణా విద్యార్థినులు భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్ వద్ద తమ గోడును వెల్లబోసుకున్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణ పరిధిలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కళాశాల వసతిగృహాన్ని ఎమ్మెల్యే వెంకట్రావ్ మంగళవారం సందర్శించారు. కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. కళాశాలకు నైట్ వాచ్‌మెన్ లేడని, వంటకు కుక్ లేడని ఎమ్మెల్యేకు వివరించారు. పాత భవనం కావడంతో వర్షాలకు తరగతి గదులు కురుస్తున్నాయని, పుస్తకాలు, సామగ్రి తడుస్తున్నాయని తెలిపారు. తాగునీటికి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని కోరారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్, సరిపడా సిబ్బంది లేరని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే..అక్కడే ఐటీడీఏ పీవో రాహుల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. స్పందించిన పీఓ ఆయా సమస్యను బట్టి పరిష్కారానికి హామీనిచ్చారు.

సమస్యలపై చర్చ..

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద నల్లబెల్లి గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలసి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్థానిక సమస్యలపై చర్చించారు.దుమ్ముగూడెం కరకట్టపై ఏర్పడిన గుంతలు, కరెంటు సమస్యలు, జడ్ వీరభద్రారం సమీపంలో తాలిపేరు ప్రధాన కాలువలో బండరాయి అడ్డుగా ఉండటం తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. తక్షణం సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెల్లం సీతమ్మ,మాజీ సర్పంచ్ మట్టా శివాజీ,నాయకులు పిలక వెంకటరమణారెడ్డి, అయ్యప్ప రెడ్డి శ్రీధర్, కెల్లా శేఖర్, వెంకన్న రాజు, పెద్దిరాజు, వేమన వెంకటేశ్వరరావు, కొమ్ము రంజిత్, గంగాధర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం: ఎమ్మెల్యే వెంకట్రావుకు సమస్యలు వివరిస్తున్న విద్యార్థులు

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ



చంద్రుగొండ: బాధ్యతలు స్వీకరిస్తున్న సంజీవరావు

చంద్రుగొండ: మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా సంజీవరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిగా ఉన్న ఆయనకు మండల పరిషత్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అప్పగించారు.

ములకలపల్లి: ములకలపల్లి మండల ప్రత్యేకాధికారిగా ఎం.రమేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ప్రత్యేకాధికారుల పాలనలో భాగంగా డిస్ట్రిక్ గ్రౌండ్ వాటర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించే రమేష్ ఇక్కడకు నియమితులయ్యారు.

బూర్గంపాడు: మండల ప్రత్యేక అధికారిగా మంగళవారం జి.వెంకటేశ్వరరెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం నాగినేనిప్రోలు గ్రామంలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని పల్లె దవాఖానాలో మొక్కలు నాటారు. దవాఖానాలో ఫీవర్ సర్వే రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్, ఏఓ శంకర్, పంచాయతీ కార్యదర్శి బాలయ్య పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరు మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మార్కెటింగ్ అధికారి మహమ్మద్ అలీమ్ నియమితులయ్యారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

కరకగూడెం: కరకగూడెం మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా.. మండల స్పెషల్ ఆఫీసర్గా ఇదివరకే బాధ్యతలు నిర్వహిస్తున్న మైనింగ్ ఏడీ దినేష్ కుమార్‌కు కలెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

ఆస్పత్రుల్లో తనిఖీ

అశ్వారావుపేటరూరల్: పలు ప్రైవేటు ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాల్లో మంగళవారం వైద్యాధికారి రాందాస్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అశ్వారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి, మరో రక్త పరీక్షా కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. చికిత్స పరిధి, రిజిస్ట్రేషన్, రికార్డులు తదితర అంశాలపై ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు సూచనలు చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కరకగూడెం: మండల పరిధిలోని భట్టుపల్లి రైతు వేదికలో 21 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పులుసుబొంత ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలలో పలువురు విద్యార్థినులకు ఏకరూప దుస్తులు అందజేశారు. కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ దినేష్ కుమార్, తహసీల్దార్ నాగ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, వైద్యాధికారి కారం మధు, ఏఓ ఛటర్జీ, విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్ రెడ్డి, ఆర్‌ఐలు షేక్ హుస్సేన్, కృష్ణ ప్రసాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుసేన్ పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: పినపాక రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 33 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో మంగళవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేశారు. ఇంటింటికి తిరిగిన వైద్యసిబ్బంది జ్వరపీడితుల నుండి రక్తనమూనాలు సేకరించారు. డాక్టర్ కనకం, వైద్యసిబ్బంది పూర్ణ, సుమతి, బుజ్జమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతి

చంద్రుగొండ: గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయనకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్, నాయకులు వరికూటి వెంకట్రావ్, బాణోత్ మోదీన్, లక్ష్మిణ్, బాలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీ

దుమ్ముగూడెం: ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ర్యాలీ చేపట్టి విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో కొప్పుల తిరుపతి, కొప్పుల మల్లూరు, కంచెర్ల కమాలాకర్, చలిగంజి సాయి, జంగిటి రాము, గంగపూరి ఈశ్వర్, జిలకర గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నేత వర్ధంతి

ములకలపల్లి: ఏఐఎస్ఎఫ్ జిల్లా దివంగత అధ్యక్షుడు గజ్జల సందీప్ ద్వితీయ వర్ధంతిని మంగళవారం మండలపరిధిలోని పొగళ్లపల్లిలో నిర్వహించారు. తొలుత సందీప్ స్మారక స్థూపంవద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్, మండల కార్యదర్శి ఎండి.యూసఫ్, జిల్లాసమితి సభ్యుడు ఉప్పుశెట్టి రాహుల్, హరీష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వర్కా అజిత్, కొదుమూరి పుల్లారావు, జబ్బార్, నరాటి రమేశ్, అనుమల సాయి పాల్గొన్నారు.

వినియోగదారుల సదస్సు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని రైతువేదికలో నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు (కోర్టు) ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కనెక్షన్ల పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం తదితర సమస్యలు పరిష్కరించబడుతాయని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

కరకగూడెం: నేడు కరకగూడెం విద్యుత్ ఉపకేంద్రం నందు 33/11కేవీ లైన్ మరమ్మతుల చేస్తునందున ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మండలం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కొనుగోలు చేస్తాం..

గుండాల: గిరిజనులు సేకరించి తీసుకువచ్చే అటవీ ఉత్పత్తులను జీసీసీ ద్వారానే కొనుగోలు జరుపుతామని జీసీసీ జనరల్ మేనేజర్ నర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని జీసీసీ, పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో లభించే కేజీ ముష్టిగింజ రూ. 49లు, ఇప్ప పలుకులు కేజీ రూ.29లకు తీసుకుంటామన్నారు. సేల్స్‌మెన్ అంబటి శ్రీనివాస్, పగడయ్యలు పాల్గొన్నారు.

జీఎంకు వినతి

మణుగూరురూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి ఐరన్ మెట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగంపల్లి రమేష్, దుగ్గి బ్రహ్మతేజ, బీఎంఎస్ నాయకులు శివకుమార్, కుంట రవికుమార్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

తెలంగాణా సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీల నాయకుల ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. జయశంకర్ తన జీవితాన్ని తెలంగాణా ఉద్యమానికి అంకితం చేశారని, తొలి నాళ్లలోనే ప్రత్యేక రాష్ట్రం పోరాటానికి నాంది పలికారని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి



అశ్వారావుపేటరూరల్: విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



దుమ్ముగూడెం: పర్ణశాల హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి..



అన్నపురెడ్డిపల్లి: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్



మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న ఏరియా జీఎం రాంచందర్, అధికారులు



చంద్రుగొండ : జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ అశోక్



భద్రాచలంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూలమాల వేస్తున్న అధ్యాపకులు..



చర్లరూరల్: బీఆర్‌ఎస్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు..



గుండాల: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు



అశ్వాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ జయంతి..



కరకగూడెం: ఎంపీడీఓ కార్యాలయంలో జయశంకర్‌కు నివాళి..

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



అన్నపురెడ్డిపల్లి: మొక్క నాటుతున్న డీఎల్‌పీఓ రమణ

మణుగూరురూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్ట్ ఆవరణలో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఉపేందర్, న్యాయవాదులు పోశం భాస్కర్, పద్మావతి, వాసవి, సంధ్య, ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామంలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని కొత్తగూడెం డివిజన్ పంచాయతీ అధికారి రమణ మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రహదారి వెంట మొక్కలను నాటారు. గ్రామంలోని చేపట్టిన ఇంగుడుగుంత నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పశువుల దొడ్డి మరమ్మతు చేయాలని కాంగ్రెస్‌పార్టీ యువజన నాయకుడు వేముల నరేష్ డీఎల్‌పీఓకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సురేస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తును వదలాలి

గుండాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పోలీసులు డ్రగ్స్, గంజాయి నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలను వివరించారు. వాటి వినియోగన నియంత్రణకు తల్లిదండ్రుల కర్తవ్యాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజమౌళి, కార్యదర్శి శ్యాం సుందర్, నాగరాజు పాల్గొన్నారు.

దమ్మపేట: నిషేధిత గంజాయి రవాణా, వినియోగంకు వ్యతిరేకంగా దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో గోడ పత్రికలు మంగళవారం ఆవిష్కరించారు. నిషేధిత గంజాయి వివరాలు తెలిసినవారు ఫోన్ నంబర్లు 8712682133, 8712682135కు సమాచారం అందజేయాలని ఎస్సై కోరారు.

తపాలాశాఖ సేవలపై అవగాహన

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బ్రాంచ్ పోస్టాఫీస్‌లో మణుగూరు సబ్ డివిజన్ ఐపీఓ రామ్మూర్తి ఆధ్వర్యంలో తపాలా శాఖ సేవలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నెల్లిపాక మాజీ సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం శంకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.